నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, బుధవారం 28 ఆగస్టు 2024 | YADADRI BHUVANAGIRI

ఎంజీయూ పీజీ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

రామగిరి, ఆగస్టు 27 : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాలల్లో వివిధ పీజీ కోర్సులు సెమిస్టర్ -2 రెగ్యులర్, సెమిస్టర్-1 బ్యాక్‌లాగ్ పరీక్షలను సెప్టెంబర్‌లో నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదట విడుదల చేసిన టైమ్ టేబుల్‌ను మార్చి సెప్టెంబర్ 6 నుంచి సెమిస్టర్ -1 బ్యాక్‌లాగ్, సెప్టెంబర్ 9 నుంచి సెమిస్టర్-2 రెగ్యులర్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. టైమ్ టేబుల్‌ను కళాశాలలకు పంపించినట్లు వివరించారు.

నేటి నుంచి రుణమాఫీ సర్వే

- యాప్‌లో క్షేత్రస్థాయి వివరాల అప్‌లోడ్
- ఇతర కారణాలతో మాఫీ కాని రైతుల పరిస్థితి ప్రశ్నార్థకం
- ఉమ్మడి జిల్లాలో రేషన్ కార్డు లేని రైతులు 72,500మందికిపైనే..
- ఏఓల ఆధ్వర్యంలో సర్వే.. ఆ తర్వాత రైతుల సెల్ఫ్ డిక్లరేషన్

తొలి విడుతగా రేషన్ కార్డు లేని వారి వివరాలు మాత్రమే సేకరణ

నల్లగొండ, ఆగస్టు 27 : రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ సర్కారు పెడుతున్న కొర్రీలు, అనుసరిస్తున్న విధానాలతో రైతులు తీవ్రంగా మదన పడుతున్నారు. ఎలాంటి షరతులూ లేకుండా రైతులందరికీ 2 లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికల ముందు ప్రకటించినా, అధికారంలోకి వచ్చాక నానా కారణాలతో దాదాపు సగం మందికి కోత పెట్టడం దుమారం రేపింది. అన్నదాత ఆగ్రహానికి గురైన సర్కారు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించినా.. అది అసంపూర్తిగా ఉండడంతో విమర్శలు వస్తున్నాయి. ఇప్పటి వరకు మూడు విడతలుగా రూ.2లక్షల వరకు మాఫీ చేశామని అంటున్న సర్కార్ తాజాగా పలు కారణాలతో ఆగిన మాఫీలను పూర్తిచేస్తామని ప్రకటించింది. కానీ.. తొలుత రేషన్ కార్డు లేని వారి వివరాలు మాత్రమే సేకరించి వారికి మాత్రమే రుణమాఫీ చేసే దిశగా చర్యలు తీసుకుంటుడడంతో మిగిలిన కారణాలతో ఆగిన వారి పరిస్థితి ఏంటదన్నది ప్రశ్నార్థకంగా మారింది. రేషన్ కార్డు లేని వారికే మాఫీ వర్తింప చేస్తే బ్యాంకుల్లో పేర్లు ట్యాలీ కాలేదని, ఆధార్ కార్డు సరిగ్గా లేదని ఆపిన మాఫీ సంగతి ఏంటి అనే దానిపై ఇప్పటివరకు స్పష్టత ఇవ్వకపోవడం మరింత గందరగోళానికి దారితీస్తున్నది. ఉమ్మడి జిల్లాలో రేషన్ కార్డు లేని కారణంగా రుణమాఫీకి దూరమైన రైతులు 72500మందికిపైగా ఉన్నట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు. అందులో నల్లగొండ జిల్లాలో 35వేల మంది, సూర్యాపేట జిల్లాలో 21,916 మంది, యాదాద్రి భువనగిరి జిల్లాలో 15,584 మంది ఉన్నారు. మిగిలిన కారణాలతో మాఫీ కాని రైతులు ఎంతమంది అన్నదానిపై అధికారుల వద్ద సమాధానం లేదు.



రేషన్ కార్డు లేని వారి వివరాల సేకరణ..

రేషన్ కార్డు లేని కారణంగా రుణమాఫీ ఆగిన రైతుల వివరాలు సేకరించేందుకు ప్రభుత్వం రైతు భరోసా రుణమాఫీ పేరుతో యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌లో నేటి నుంచి మండల వ్యవసాయ అధికారులు వివరాలు నమోదు చేయనున్నారు. ఆయా బ్యాంకుల నుంచి వివరాలు తీసుకొని మొదటగా ఇంటి యజమాని, ఆ తర్వాత భార్య, కుమారుడు, కూతురు, ఇతర కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్ కార్డు నెంబర్లు, తీసుకున్న రుణాలు వంటివి పరిశీలించి రెండు లక్షల రూపాయల వరకు పొందు పరచనున్నారు. ఇది ఒక సెల్ఫ్ డిక్లరేషన్ పత్రంలో పొందుపరిచి సంబంధిత రైతుతో సంతకం చేయించి పంచాయతీ కార్యదర్శితో అటెస్టేషన్ చేయించనున్నారు. సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయించే బాధ్యత మండల వ్యవసాయ అధికారులకు అప్పగించారు.

మిగిలిన రైతుల పరిస్థితి ఏంటి?

రుణమాఫీ అనేది రైతులలతోపాటు బ్యాంకర్లకు, వ్యవసాయ అధికారులకు బేతాలుడి ప్రశ్నలా మిగిలింది. మాఫీ అయిన వారికి ఓకే. కాని వారికి మాత్రం ఎందుకు కాలేదు, కారణం ఏంటిఅనేది అంతు చిక్కని ప్రశ్నగా మారింది. ఆధార్ కార్డుతో సంబంధిత సైట్‌లో చెక్ చేస్తే.. కుటుంబ సభ్యుల వివరాలు సరిగ్గా లేవు.. ఆధార్ నెంబర్ తప్పుగా ఉంది.. బ్యాంకు ఖాతాకు ఆధార్ కార్డుకు పేరు మ్యాచ్ అవడం లేదు వంటి సమాధానాలు వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు సగం మంది రైతులకు రుణమాఫీ కాలేదనేది క్షేత్రస్థాయిలో పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. తాజాగా ప్రభుత్వం రేషన్ కార్డు లేనివారి వివరాలు సేకరిస్తుండగా.. రెండు లక్షల రుణం దాటిన వారు అదనపు డబ్బులు తిరిగి బ్యాంకులకు చెల్లించాలనే మెలిక కూడా పెట్టింది.

ప్రభుత్వం నిర్ణయం మేరకే మాఫీ

నల్లగొండ జిల్లాలో 35వేల మంది రైతులకు రేషన్ కార్డు లేక రుణమాఫీ కాలేదు. వారి వివరాలు సేకరించి వారు తీసుకున్న రుణం వివరాలు ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ప్రతి మండల వ్యవసాయాధికారి క్షేత్ర స్థాయిలో సర్వేలో పాల్గొంటారు. రైతులు తమ వివరాలను మండల వ్యవసాయ అధికారులకు తెలియ చేయాలి. ఆ తర్వాత ప్రభుత్వ నిర్ణయం బట్టి మాఫీ జరుగుతుంది.

–శ్రవణ్ కుమార్,
జిల్లా వ్యవసాయాధికారి, నల్లగొండ

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

లక్ష్మీనరసింహుడి సేవలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

- ఆలయ పరిసరాలను కలియదిరిగిన గవర్నర్
- ఆలయ పునర్నిర్మాణ శైలిపై హర్షం

యాదగిరిగుట్ట, ఆగస్టు 27 : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి సేవలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తరించారు. గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి స్వామివారి దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంగౌడ్‌తో కలిసి రోడ్డు మార్గంలో యాదగిరిగుట్ట కొండపైన వీవీఐపీ అతిథి గృహం వద్దకు చేరుకున్నారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ హనుంతరావు, కలెక్టర్ హనుమంత్ కే జండగే, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. అతిథి గృహం వద్ద గవర్నర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. వీవీఐపీ అతిథి గృహంలోకి వెళ్లి ఆలయ సంప్రదాయ వస్త్రాలను ధరించారు. పర్యాటక శాఖకు చెందిన బ్యాటరీ వాహనంపై కొండపైన బస్టాండ్ ప్రాంగణం గుండా విష్ణు పుష్కరిణి వద్దకు చేరుకున్నారు. అక్కడే స్నాన సంకల్పంలో పాల్గొన్నారు. బ్యాటరీ వాహనంపై కొండపైన మాఢవీధుల్లో గల అఖండ దీపారాధన వద్దకు చేరుకుని పూజలు చేశారు. స్వామివారికి కొబ్బరికాయను సమర్పించారు. వాయిద్యాలు, మేళతాళాల మధ్య తూర్పు రాజగోపురంలోకి ప్రవేశించి త్రితల రాజగోపురం గుండా ముఖ మండపంలోకి వెళ్లారు. ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, వేద పండితులు గవర్నర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలోకి వెళ్లే మార్గంలో గల క్షేత్ర పాలకుడి ఆలయం వద్ద అర్చకులు స్వామివారి హారతిని ఇచ్చారు. ముఖ మండపంలోని ధ్వజస్తంభానికి గవర్నర్ మొక్కారు. స్వామివారి గర్భగుడిలోకి వెళ్లి స్వయంభూమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 నామాలతో అష్టోత్తర పూజలు జరిపారు. సుమారు 9 నిమిషాల పాటు గర్భగుడిలో స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆండాళ్ అమ్మవారిని, ఆళ్వారులకు నమస్కరించుకున్నారు. ముఖ మండపంలో ఉత్తరం అభిముఖంగా గవర్నర్‌ను కూర్చొబెట్టి ఆలయ ప్రధానార్చకులు, వేదపండితులు, అర్చక బృందం చతుర్వేద ఆశీర్వచనం అందించారు. దేవదాయ, ధర్మదాయశాఖ కమిషనర్ హనుంతరావు వీఐపీ శాలువాతో సన్మానించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి స్వామివారి మహాప్రసాదాన్ని అందజేశారు. ఈఓ భాస్కర్‌రావు రాగితో తయారు చేసిన స్వామివారి ప్రతిమను బహూకరించారు. ఈ సందర్భంగా పశ్చిమ రాజగోపురం వద్ద మీడియాతో గవర్నర్ మాట్లాడారు. యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణ శైలి తనను ఎంతగానో ఆకట్టుకున్నదని కితాబునిచ్చారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకోవడం తన జీవిత కాలపు అనుభవంగా గుర్తుండిపోతుందన్నారు. త్వరలో మరోసారి స్వామివారిని దర్శించుకోనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రజలందరికీ స్వామివారి ఆశీసులు ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. పశ్చిమ రాజగోపురం వద్ద నుంచి లిఫ్ట్ వరకు బ్యాటరీ వాహనంలో వచ్చి లిఫ్ట్ గుండా వీవీఐపీ విడిదికి వచ్చారు. అక్కడే దేవస్థానం ఆధ్వర్యంలో అల్పాహారంలో భాగంగా పులిహోర, దద్దోజనం, కట్టెపొంగలి, సీరను స్వీకరించారు. పోలీసులు గౌరవ వందనం అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. కార్యక్రమంలో ఆలయ డీసీపీ రాజేశ్ చంద్ర, ఏఈవోలు జూశెట్టి కృష్ణ, రఘు, ఏసీపీ రమేశ్‌కుమార్, సీఐ రమేశ్ పాల్గొన్నారు.

సందర్శకుల పుస్తకంలో..

స్వామివారిని దర్శించుకున్న గవర్నర్ సందర్శకుల పుస్తకంలో తన అనుభూతిని రాశారు. ఆలయ సందర్శన వల్ల పూర్తి ఆధ్యాత్మిక అనుభూతి చెందానని, దేశంలోనే ప్రముఖ ఆలయంగా ఆధ్యాత్మికతను సంతరించుకున్నదని పేర్కొన్నారు. ఆలయ నిర్వహణ తీరు ప్రశంసనీయమని లిఖించారు.

షరతుల్లేకుండా రుణమాఫీ చేయాల్సిందే..

- రైతులను మోసం చేస్తున్న రేవంత్ సర్కారు
- కలెక్టరేట్ల ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతుసంఘం నాయకులు

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 27 : ఎన్నికల ఇచ్చిన హామీ మేరకు షరతులు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ 2 లక్షల రుణమాఫీ చేయాల్సిందేనని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. వివిధ కారణాలతో రైతులను రుణమాఫీకి దూరం చేయడాన్ని నిరసిస్తూ మంగళవాం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రైతులతో కలిసి ఆందోళనలు చేపట్టింది. నల్లగొండ, యాద్రాద్రి భువనగిరి కలెక్టరేట్ల ఎదుట ధర్నాకు దిగింది. సీపీఐ నాయకులు వారికి మద్దతు తెలిపారు. భువనగిరి కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజ్‌గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల్లో హామీనిచ్చినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.ఆగస్టు 15 వరకు అందరికీ మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినా, సగం మందికి కూడా కాలేదని స్పష్టం చేశారు. రుణమాఫీతోపాటు రైతు భరోసా కూడా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారి జగన్ మోహన్, వ్యవసాయాధికారి నీలిమకు వినతిపత్రం అందజేశారు.

ఎమ్మెల్సీ కవితకు బెయిల్‌పై హర్షాతిరేకాలు

- భువనగిరిలో పటాకులు కాల్చి సంబురాలు

భువనగిరిలో పటాకులు కాల్చి సంబురాలు చేస్తున్న జాగృతి నాయకులు

భువనగిరి కలెక్టరేట్/యాదగిరిగుట్ట, ఆగస్టు 27 : భారత జాగృతి సంస్థ జాతీయ అధ్యక్షురాలు, ఎ మ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంపై బీఆర్ఎస్, జాగృతి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. భువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రిన్స్ చౌరస్తాలో జాగృతి సంస్థ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సుజిత్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం పటాకులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొంటూనే.. మన సంస్కృతికి, సంప్రదాయాల పరిరక్షణకు బతుకమ్మతో కవిత చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. బీజేపీ ప్రభుత్వం కక్షగట్టి ఆమెను జైలు పాలు చేయడం దుర్మార్గమన్నారు. సుప్రీం కోర్టు తీర్పు అందుకు చెంపపెట్టు అని పేరొన్నారు. కార్యక్రమంలో జాగృతి జిల్లా నాయకులు మచ్చ చక్రవర్తి, తుంగతుర్తి సంతోశ్, నరేశ్‌యాదవ్, ప్రభాకర్, భాను రిజ్వాన్, వినయ్, శివ, మహేందర్, బీఆర్ఎస్ నాయకులు చిరంజీవి, సురేశ్ యాదవ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు బెయిల్ సంతోషకరం

రాజకీయ దురుద్దేశంతో ఢిల్లీ లిక్కర్ కేసులో అన్యాయంగా ఇరికించి, అరెస్టు చేసిన ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడం ఎంతో సంతోషకరం. ఈ కేసులో బలం లేదు. తెలంగాణలో బీఆర్ఎస్‌ను ఎదుర్కొనలేకనే బీజేపీ దొంగదెబ్బ తీయాలని తప్పుడు కేసులు నమోదు చేయించింది. ఆధారాలు లేకున్నా అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేశారు.

– గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి,
మాజీ ప్రభుత్వ విప్

ధర్మమే గెలిచింది

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ రావడం పట్ల హర్షణీయం. మహిళా ప్రజాప్రతినిధిపై బీజేపీ ప్రభుత్వం దాడికి దిగింది. బీఆర్ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక అరెస్టులతో ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేసింది. కుట్రపూరితంగా వ్యవహరించి కవిత ఇన్ని రోజులు జైలులో ఉంచడం దారుణం. ఈ కేసులో ఏమీ లేదు, ఇలాంటి కేసును ఎందుకు ఇన్ని రోజులు పెండింగ్ పెట్టారని సుప్రీం కోర్టు న్యాయమూర్తులే ఈడీని ప్రశ్నించారు. దాంతో కవిత నిర్దోషి అని తేలిపోయినట్టు అయ్యింది. ధర్మమే గెలిచింది.

– బూడిద భిక్షమయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే

పది రోజుల్లో ఏఎమ్మార్పీ నాలుగో మోటార్ రన్ చేస్తాం

- ఎస్ఈ అజయ్‌కుమార్
- పుట్టంగండిలో మోటార్ మరమ్మతు పనుల పరిశీలన

పుట్టంగండి పంపుహౌజ్‌లో మోటార్ మరమ్మతులను గురించి తెలుసుకుంటున్న ఎస్ఈ అజయ్‌కుమార్

పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 28 : ప్రస్తుతం ఏఎమ్మార్పీ మూడు మోటార్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతున్నదని, 10 రోజుల్లో నాలుగో మోటారు మరమ్మతులు పూర్తి చేసి నీటిని విడుదల చేస్తామని ఎస్ఈ వి. అజయ్‌కుమార్ తెలిపారు. ఏఎమ్మార్పీ ప్రాజెక్టులో భాగమైన పుట్టంగండి పంప్‌హౌస్‌లోని నాలుగో మోటారు మరమ్మతులతో పాటు సిస్టర్న్, ఏకేబీఆర్ రిజర్వాయర్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం పుట్టంగండి పుంపుహౌస్‌లో ఇరిగేషన్, జెన్‌కో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగో యూనిట్ మరమ్మతుల పనులు వేగవంతం చేయాలని జెన్‌కో అధికారులను ఆదేశించారు. అనంతరం సిస్టర్న్ కట్టపై గతంలో కూలిన ప్యారా ఫిట్‌వాల్ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, నాలుగో మోటార్ ప్రారంభించగానే ఏకేబీఆర్ పూర్తి స్థాయిలో నింపి డీ-7 బీకి నీటి విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు.నీటి విడుదలకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. ఆయన వెంట ఈఈ సత్యనారాయణ, డీఈ నాగయ్య, ఏఈఈలు శిల్ప, శ్రావణ్, జెన్‌కో అధికారులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్, పక్కన కలెక్టర్ హనుమంతు కే జెండగే

గిరిజన సమస్యలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలి

- జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్

భువనగిరి కలెక్టరేట్/ బీబీనగర్, ఆగస్టు 27 : గిరిజన సమస్యలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ కోరారు. మంగళవారం బీబీనగర్ మండలంలోని ఎయిమ్స్ దవాఖానను ఆయన సందర్శించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశం మందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో పాల్గొన్నారు. గిరిజన సంఘాల ప్రతినిధులు కమిషన్ దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన హక్కులను కాపాడుతూ వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. మారుమూల తండావాసుల విషయంలో అధికారులు చొరవ తీసుకొని న్యాయం చేయాలని సూచించారు. సమస్యలపై ఆన్‌లైన్‌లోనూ గిరిజన కమిషన్‌కు ఫిర్యాదులు అందించవచ్చునని తెలిపారు. సింగన్నగూడెం బాలిక హాస్టల్, ఎల్లమ్మ గుడి బాయ్స్ హాస్టళ్లలో డ్రైనేజీ సమస్యలు రెండ్రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. 2005 సంవత్సరానికి ముందు నుంచి సేద్యం చేస్తున్న గిరిజనులకు భూమిపై హక్కు కల్పిస్తూ పట్టాలు జారీ చేయాలని సూచించారు. అట్రాసిటీ కేసులకు సంబంధించి చార్జిషీట్ దాఖలు కాగానే వంద శాతం నష్టపరిహారం బాధితులకు అందించేలా చర్యలు తీసుకోవాలని డీసీపీకి సూచించారు. లప్పానాయక్ తండాలో భూమి కోల్పోయిన వారికి బహిరంగ మార్కెట్‌లో ఉన్న రేటు కట్టిచ్చేలా, లేదా భూమికి భూమి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాచకొండ మండలంలో పాత పాస్‌పుస్తకాల స్థానంలో కొత్తవి ఇవ్వలేదని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో మూసివేసిన 6 గిరిజన పాఠశాలలను తిరిగి ప్రారంభించాలన్నారు. జిల్లాలో సంత్ సేవాలాల్ మహారాజ్ గుడి, బంజారా భవన్ ఏర్పాటు కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. వైటీడీఏ పరిధిలో అన్ని రకాల ఉద్యోగాల్లో ఎస్టీ రోస్టర్ సరిగ్గా మెయింటెన్ చేసేలా, రిజర్వేషన్లు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బీబీనగర్ ఎయిమ్స్‌లో పనిచేసే మహిళా ఉద్యోగులు బయటి ప్రాంతాల నుంచి వచ్చి వెళుతున్నందున వారికి పోలీస్ భద్రత కల్పించాలని డీసీపీకి సూచించారు. మైనింగ్ పనుల్లో గిరిజనులకు అనుమతుల కోసం చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. తండాల్లో గిరిజనుల ఆస్తి, ప్రాణాలను హరించే బెల్ట్ షాపుల నిర్మూలనకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. సమావేశంలో కలెక్టర్ హనుమంతు కే జెండగే, డీసీపీ రాజేశ్‌చంద్ర, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కే గంగాధర్, ఆర్డీఓ అమరేందర్, జడ్పీ సీఈఓ శోభారాణి, జిల్లా గిరిజన సంక్షేమ ఇన్‌చార్జి అధికారి నాగిరెడ్డి, నీటి పారుదల శాఖ ఎస్ఈ శ్రీనివాస్, వివిధ గిరిజన సంఘాల ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోచంపల్లిలో రూ.కోటిన్నర హాశిష్ ఆయిల్ స్వాధీనం

- కటకటాల్లోకి నిందితులు

పోలీసుల అదుపులో నిందితులు

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 27 : ఈజీ మనీకి అలవాటు పడి మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్న ముఠాను భువనగిరి ఎస్ఓటీ, భూదాన్‌పోచంపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భూదాన్‌పోచంపల్లి ఎస్ఐ భాస్కర్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా అక్కంపేట మండలం కోలమామిడి గ్రామానికి చెందిన గమ్మెల్లి గోవింద రావు, రాహులపేట గ్రామానికి చెందిన కొర్ర రాంబాబు స్నేహితులు. వ్యవసాయం చేసుకుని జీవనం సాగించే వీరు సులువుగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో అదే జిల్లాకు చెందిన చంటి, లక్ష్మీ నాయుడు దగ్గర గంజాయి, హాశిష్ ఆయిల్ (10.2 కేజీలు)ను తక్కువ ధరకు కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయించేందుకు సోమవారం అర్ధరాత్రి బయల్దేరారు. భూదాన్ పోచంపల్లి మండలం కొత్తగూడెం ఎక్స్ రోడ్ వద్ద బస్సు దిగిన వీరు.. పోచంపల్లి అయ్యప్ప దేవాలయం వద్ద విక్రయించేందుకు ప్రయత్నించగా.. పక్కా సమాచారంతో భువనగిరి ఎస్ఓటీ, పోచంపల్లి పోలీసులు గోవర్ధన్‌రావు, కొర్ర రాంబాబును పట్టుకున్నారు. చంటి, లక్ష్మీనాయుడు తప్పించుకున్నారు. వారి నుంచి కోటీ 52 లక్షల విలువైన హాశిష్ ఆయిల్, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

కీలక శాఖలకు బాసులేరి?

నాలుగైదు శాఖలకు ఇన్‌చార్జీలే దిక్కు..

- సీజనల్ వ్యాధుల టైమ్‌లో డీఎంహెచ్‌ఓ పోస్ట్ ఖాళీ
- విద్యాశాఖలో ఇన్‌చార్జీలతోనే నెట్టుకొస్తున్న వైనం
- గిరిజన, మైనార్టీ శాఖలదీ అదే పరిస్థితి
- ఎక్కడికక్కడ పేరుకుపోతున్న సమస్యలు
- క్షేత్రస్థాయిలో కొరవడిన పర్యవేక్షణ

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ) : పరిపాలనలో అత్యంత కీలకమైన శాఖలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. విద్య, వైద్య విభాగాలను గాలికి వదిలేసింది. రెగ్యులర్ అధికారులను నియమించకుండా ఇన్‌చార్జీలతో నెట్టుకొస్తున్నది. జిల్లాలో విద్య, వైద్య, గిరిజన, మైనార్టీ శాఖలకు బాస్‌లు లేరు. ఇటీవల పలువురు జిల్లా అధికారులు వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. తిరిగి అవి భర్తీ కాకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడ పేరుకుపోతున్నాయి. కింది స్థాయిలో పర్యవేక్షణ కొరవడడం వల్ల పాలన అస్తవ్యస్తంగా మారింది.

డీఎంహెచ్‌ఓ పోస్ట్ ఖాళీ..

ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వేలాది మంది రోగాల బారిన పడుతున్నారు. ఆస్పత్రులకు రోగులు క్యూ కడుతున్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో జిల్లాలో డీఎంహెచ్‌వో పోస్టు ఖాళీగా ఉంది. గత నెల వరకు డీఎంహెచ్‌ఓగా ఉన్న పాపారావు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మళ్లీ ఎవరూ రాలేదు. ప్రస్తుతం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యశోద ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆమె కూడా అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలు మాత్రమే ఇవ్వడం గమనార్హం. అన్ని జిల్లాల్లో వెంటనే నియమించినా మన దగ్గర మాత్రం ఇంకా నియామకం చేపట్టలేదు. జిల్లా అధికారి పర్యవేక్షణ కరువవడంతో వైద్యారోగ్య శాఖలో అంతా ఇష్టారాజ్యంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గిరిజన సంక్షేమ శాఖకు ఇన్‌చార్జీనే...

గిరిజన సంక్షేమ శాఖకు పూర్తి స్థాయి అధికారి లేరు. గతంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారిగా ఉన్న మంగ్తానాయక్ ఏసీబీకి పట్టుబడ్డారు. అప్పటి నుంచి ఆ పోస్ట్ ఖాళీగా ఉంది. డీఆర్డీఓగా ఉన్న నాగిరెడ్డి ఇన్‌చార్జీగా వ్యవహరిస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో హాస్టళ్లు, ఇతర సంక్షేమ పథకాలు కొనసాగుతాయి. పూర్తి స్థాయి అధికారి లేకపోవడంతో పథకాలు, కార్యక్రమాలు అంతంత మాత్రంగానే అమలు అవుతున్నాయి.

మైనార్టీ శాఖలో రెండేండ్లకు పైగా..

జిల్లాలో మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి పోస్టు కూడా ఖాళీగానే ఉంది. గతంలో మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిగా సత్యనారాయణ ఉండేవారు. ఆయన వెళ్లిపోయాక బీసీ సంక్షేమ శాఖ అధికారిగా ఉన్న యాదయ్యకు ఇన్‌చార్జీ బాధ్యతలు ఇచ్చారు. ఈ శాఖ పరిధిలో వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ పోస్ట్‌ను కూడా భర్తీ చేయలేదు.

విద్యాశాఖలో ఇలా..

విద్యాశాఖ విషయానికి వస్తే.. ఇప్పటివరకు డీఈఓ నారాయణరెడ్డి సెలవులో వెళ్లి రెండు నెలలు అవుతున్నది. ఆయన స్థానంలో ప్రశాంత్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. నారాయణరెడ్డికి త్వరలో రిటైర్మెంట్ ఉంది. దాంతో ఆయన స్థానంలో కొత్త డీఈఓ వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. జిల్లాలో ఎంఈఓల కొరత కూడా తీవ్రంగా వేధిస్తున్నది. 17 మండలాల్లో మూడు, నాలుగు మండలాలకు మాత్రమే రెగ్యులర్ ఎంఈఓలు ఉన్నారు. మిగతా అన్ని చోట్ల ఇన్‌చార్జీలతోనే నెట్టుకొస్తున్నారు.

2 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

హాలియా, ఆగస్టు 27: నాగార్జున సాగర్ జలాశయం నుంచి సోమవారం రాత్రి నుంచి 2 క్రస్ట్ గేట్ల ద్వారా 16,200 క్యూసెక్కుల నీటిని ఎన్ఎస్‌పీ అధికారులు దిగువకు విడుదల చేశారు. శ్రీశైలం జలాశయం నుంచి నాగార